www.prajavinikidi.com
RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా వినికిడి
తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
8978701613,7013016545

సంపుటి - 3 సంచిక -13 ఆదివారం 13 ఏప్రిల్ 2025 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజీలు -4 వెల - 3/-

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## రూ.700 కోట్ల ఆస్తుల స్వాధీనానికి ఈడీ రెడీ

- నేషనల్ హెరాల్డ్ కేసులో కీలక పరిణామం
- ఢిల్లీ, ముంబై, లక్నోలలోని ఆస్తులు జప్తునకు రంగం సిద్ధం
- నకిలీ విరాళాలు, అద్దెల ద్వారా అక్రమంగా సంపాదించారని ఈడీ ఆరోపణ




న్యూ ఢిల్లీ ఏప్రిల్12,ప్రజావినికిడి:
నేషనల్ హెరాల్డ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దూకుడు పెంచింది. ఈ కేసులో మనీలాండరింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.700 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు ప్రారంభించింది. నేషనల్ హెరాల్డ్‌ను ప్రచురించే ఏజేఎల్ సంస్థను యంగ్ ఇండియన్ ప్రైవేట్ లిమిటెడ్ కొనుగోలు చేసింది. ఇందులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలకు 38 శాతం చొప్పున వాటా ఉంది. మిగతాది 2లో...

## బిల్లులపై నిర్ణయానికి 3 నెలల గడువు



### రాష్ట్రపతికి డెడ్ లైన్ విధించిన సుప్రీంకోర్టు...

- గడువు దాటితే కారణాలు చెప్పాలన్న సుప్రీంకోర్టు
- రాష్ట్రపతి తిరస్కరిస్తే కోర్టును ఆశ్రయించవచ్చని ప్రభుత్వాలకు సూచన
- మంత్రి మండలి సలహా మేరకే గవర్నర్ల నిర్ణయాలు ఉండాలని స్పష్టీకరణ
- తమిళనాడు ప్రభుత్వ పిటిషన్ పై విచారణలో సుప్రం కీలక వ్యాఖ్యలు



న్యూ ఢిల్లీ ఏప్రిల్12,ప్రజావినికిడి:
ఇకపై బిల్లుల ఆమోదంలో జాప్యానికి తావుండరాదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు పంపిన బిల్లులను గవర్నర్‌లు నిర్ణీత సమయంలో ఆమోదించాల్సిందేనని ఉద్ఘాటించింది. లేదంటే వారి చర్యలను న్యాయ సమీక్షకు గురిచేస్తామని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. రాష్ట్రపతి ఆమోదం కోసం పంపిన బిల్లులను కూడా మూడు నెలల్లోపు పరిష్కరించాలని ఆదేశించింది. ఈ మేరకు అత్యున్నత న్యాయస్థానం నేడు సంచలన తీర్పు వెలువరించింది. మిగతా 2లో

## వనజీవి రామయ్య ఇక లేరు

### గుండెపోటుతో కన్నుమూత
### కోటికిపైగా మొక్కలు నాటి దేశ విదేశాల్లో ఖ్యాతి



ఖమ్మం, ఏప్రిల్12,ప్రజావినికిడి:అశోకుడు మొక్కలు నాటించాడనే సంగతి పుస్తకాలకే ఎందుకు పరిమితమవ్వాలి? ఆ చొరవను మనం ఆచరణలోనూ చూపలేమా? అనే గొప్ప సామాజిక స్పృహ ఆయనది! బొమ్మలతో ఆడుకునే ఐదేళ్ల ప్రాయంలో పచ్చదనం మీద ప్రేమతో మొక్కలు నాటారాయన! మొక్కలు నాటేందుకు ఖర్చుల కోసం కొంతభూమిని అమ్మేందుకూ వెనుకాడలేదాయన! పుటుక నీది.. చావు నీది బతుకంతా దేశానిది అని కాళోజీ అంటే.. బతుకంతా ప్రకృతి సేవలోనే గడిపి.. మొక్కలు నాటడాన్ని, వాటిని పరిరక్షించడాన్నే కర్తవ్యంగా భావించి.. ఏకంగా కోటికిపైగా మొక్కలు నాటి వనజీవిగా పేరొందిన దరిపల్లి రామయ్య (79) కన్నుమూశారు. మిగతాది 2లో...

## 33 మందితో వైసీపీ రాజకీయ సలహా సంఘం...

- కన్వీనర్ గా సజ్జలపీఏసీని ప్రకటించిన జగన్
- వైసీపీ కీలకనేతలందరికీ స్థానం
- శాశ్వత ఆహ్వానితులుగా పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు



అమరావతి, ఏప్రిల్12,ప్రజావినికిడి:
వైసీపీ అధినేత జగన్ ఇవాళ తమ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీని ప్రకటించారు. ఈ పీఏసీలో 33 మంది సభ్యులు ఉన్నారు. ఎంపీలు అవినాశ్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రులు రోజా, విడదల రజని, కొడాలి నాని, మిగతాది 2లో...

## జమిలి ఎన్నికలతో సుస్థిర పాలన

### ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడంలేదు: వెంకయ్య




2లో

## అది రోడ్డు ప్రమాదమే

- పాస్టర్ ప్రవీణ్ మృతిపై పోలీసుల స్పష్టీకరణ
- ప్రమాద సమయంలో పనిచేయని బుల్లెట్ హెడ్‌లైట్..
- హైవే పక్కన కంకరపైకి వెళ్లడంతో స్కిడ్ అయిన బైకు
- ఆయనపై పడిన బుల్లెట్
- ఏ వాహనమూ ఢీ కొట్టలేదు
- 100 మందిని విచారించాం
- 400 సీసీ ఫుటేజీల పరిశీలన
- దర్యాప్తుపై ప్రవీణ్ కుటుంబ సభ్యులకు నమ్మకం
- ఏలూరు ఐజీ అశోక్ వెల్లడి





## రేపటి నుంచి భూ భారతి

### మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా..

- ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ, పరిశీలన
- ఆరు నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా అమలు
- తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా లోగో
- ఆరు నెలలపాటు ప్రతి రోజూ సమీక్ష
- ప్రతి మండలంలో సదస్సులు నిర్వహించాలి
- భూ భారతిపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి
- రేపు శిల్పకళా వేదికలో పోర్టల్ ప్రారంభం



## బాలికలదే పైచేయి

- ఇంటర్‌లో భారీగా పెరిగిన ఉత్తీర్ణత
- ద్వితీయ సంవత్సరంలో 83 శాతం మంది
- ప్రథమ సంవత్సరంలో 70% మంది పాస్
- గత పదేళ్లతో పోలిస్తే ఈ ఏడాదే అత్యధికం
- టాప్‌లో కృష్ణా... అట్టడుగున అల్లూరి జిల్లా
- రెండు సంవత్సరాల్లోనూ బాలికలదే పైచేయి
- సత్తా చాటిన ప్రభుత్వ జూనియర్ కాలేజీలు



అమరావతి,ఏప్రిల్12,ప్రజావినికిడి:
ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం గణనీయంగా పెరిగింది. రెండో సంవత్సరం 83శాతం, మొదటి సంవత్సరం 70శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ ఫలితాలను మంత్రి లోకేశ్ శనివారం ఉదయం 11గంటలకు విడుదల చేశారు. గత పదేళ్లలో ఎప్పుడూ లేనివిధంగా అత్యధిక ఉత్తీర్ణత శాతం ఈ ఏడాదే నమోదైంది. ప్రభుత్వ, ఎయిడెడ్ కాలేజీల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు నమోదు చేశారు. రెండు సంవత్సరాల్లోనూ బాలుర కంటే బాలికలే అత్యధికంగా ఉత్తీర్ణత సాధించి సత్తా చాటుకున్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టులు మృతి



## సెబీ నిబంధనలకు అనుగుణంగానే బాండ్ల జారీ



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## రూ.700 కోట్ల ఆస్తుల స్వాధీనానికి ఈడీ రెడీ

(మొదటి పేజీ తరువాయి)

తాజాగా... ఢిల్లీ, ముంబై, లక్నో నగరాల్లో ఉన్న ఏజేఎల్ ఆస్తులను ఈడీ గుర్తించింది. వాటిని స్వాధీనం చేసుకునేందుకు ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద చర్యలు చేపట్టింది. జప్తు చేయనున్న ఆస్తుల్లో ఢిల్లీలోని హెరాల్డ్ హౌస్ కూడా ఉంది. గతంలోనే ఈ ఆస్తులను ఈడీ తాత్కాలికంగా జప్తు చేసింది. అయితే, ఇప్పుడు వాటిని పూర్తిగా స్వాధీనం చేసుకునేందుకు సిద్ధమైంది. యంగ్ ఇండియన్ సంస్థ ఏజేఎల్ ఆస్తులను ఉపయోగించి రూ.18 కోట్ల నకిలీ విరాళాలు, రూ.38 కోట్ల నకిలీ అద్దెలు, రూ.29 కోట్ల నకిలీ ప్రకటనల ద్వారా అక్రమంగా డబ్బు సంపాదించిందని ఈడీ ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంలో మనీలాండరింగ్ జరిగిందని ఈడీ దాదాపు నిర్ధారణకు వచ్చింది. అందుకే పీఎంఎల్ఏ కింద ఆస్తులను జప్తు చేసేందుకు చర్యలు తీసుకుంటోంది.

## 33 మందితో వైసీపీ రాజకీయ సలహా సంఘం...

(మొదటి పేజీ తరువాయి)

వెల్లంపల్లి శ్రీనివాస్, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, అంజాద్ బాషా, ఆదిమూలపు సురేశ్, నారాయణస్వామి, అనిల్ కుమార్ యాదవ్ తో పాటు ముద్రగడ పద్మనాభం, సాకే శైలజానాథ్, నందిగం సురేశ్ తదితరులకు ఈ కమిటీలో స్థానం కల్పించారు.

ఈ రాజకీయ సలహాల కమిటీకి పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి కన్వీనర్ గా వ్యవహరిస్తారు. ఈ మేరకు వైసీపీ కేంద్ర కార్యాలయం నుంచి సభ్యుల జాబితాలతో కూడిన ప్రకటన విడుదలైంది. కొందరిని తప్పించి... దాదాపు వైసీపీలో కీలక నేతలందరికీ ఈ కమిటీలో స్థానం లభించింది. ఈ పీఏసీలో పార్టీ రీజినల్ కోఆర్డినేటర్లు శాశ్వత ఆహ్వానితులుగా ఉంటారు.

## వనజీవి రామయ్య ఇక లేరు

(మొదటి పేజీ తరువాయి)

శనివారం ఉదయం గుండెపోటుతో ఆయన నిద్రలోనే మృతిచెందారు. ఆయన స్వస్థలం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి. దరిపల్లి లాలయ్య, పుల్లమ్మ దంపతులకు 1946 జూలై 1న రామయ్య జన్మించారు. ఐదేళ్ల వయసు నుంచే మొక్కలు నాటేవారు. ముత్తగూడెంలో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో పశువుల కాపరిగా మారారు. 1967లో జానమ్మను పెళ్లి చేసుకున్నారు. రామయ్య దంపతులకు కుమారులు సైదులు, సత్యనారాయణ, కనకయ్య, కూతురు సైదమ్మ ఉన్నారు. సైదులు, సత్యనారాయణ అనారోగ్యంతో మృతిచెందారు. రామయ్య కుటుంబానికి గతంలో ఏడెకరాల భూమి ఉండేది. మొక్కలు నాటేందుకు ఖర్చులకోసం మూడెకరాలను రామయ్య అమ్మారు. రహదారుల వెంట మొక్కలు నాటుతూ, రోడ్ల వెంట ఉన్న చెట్ల వద్ద కాయలు ఏరి వాటి నుంచి వచ్చిన గింజలను ఖాళీస్థలాలు, కొండలపై జల్లుతూ ఉండేవారు. ఎవరైనా మొక్కలు కావాలని ఆయన దగ్గరకు వెళితే ఉచితంగానే గింజలు, మొక్కలను అందించేవారు. పచ్చదనంపై విస్తృత ప్రచారం చేయడమే కాకుండా ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ మొక్కలు నాటడం, 'వృక్షో రక్షతి రక్షితః' అంటూ నినాదాలు రాయడం చేసేవారు. ఇంట్లో గిన్నెలు, పాత్రలు, బీరువాలు, గోడలు ఎక్కడైనా ప్రకృతికి సంబంధించిన నినాదాలే రాసేవారు. తన కుమారుడు, కూతురు పెళ్లిళ్ల శుభలేఖపై కూడా మొక్కలు నాటాలని, వాటిని పరిరక్షించాలని నినాదాలను ముద్రించారు."వృక్షో రక్షతి రక్షితః" అనేది రామయ్య నమ్మిన నినాదం.. దాన్ని ఓ ఇనుప ప్లేట్‌పై రాసి మెడలో హారంగా వేసుకుని తిరిగేవారు. రామయ్య అద్భుతమైన శిల్పి కూడా. తన ఇంటి వద్ద గ్రానైట్ రాళ్లపై శిల్పాలను చెక్కేవారు. ఆ శిల్పాలపై కూడా వృక్షోరక్షతి రక్షితః అంటూ నినాదాలు చెక్కేవారు. 2000లో వనజీవి సేవలను గుర్తించిన నాటి సీఎం చంద్రబాబు, ఆనాటి ఆర్అండ్‌బీ మంత్రి తుమ్మల.. రామయ్యకు బైక్ బహూకరించి, దాని పెట్రోలు ఖర్చులకు నెలకు రూ.1500 మంజూరు చేశారు. నాటి టీడీపీ ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమంలోనూ రామయ్య పాలుపంచుకున్నారు. కాగా, రామయ్య కృషిని గుర్తించిన మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతిలో రామయ్య జీవితాన్ని పాఠ్యాంశంగా బోధిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘికశాస్త్రంలో వనజీవి గురించి పాఠ్యాంశం పొందుపరిచింది. రామయ్య మొక్కలపై ఉన్న ప్రేమతో తన నలుగురు మనవరాళ్లకు కబంధ పుష్పం, చందన పుష్పం, వనశ్రీ, హరితారణ్య అనే పేర్లు పెట్టి మొక్కలపై తనకున్న ప్రేమను చాటారు. అయితే కరెన్సీ నోట్లపై మొక్కల ఫొటోలను ముద్రించాలని, గ్రీన్ కరెన్సీ రావాలని రామయ్య కోరుకునేవారు. ప్రభుత్వాల పెద్దలను కలిసినప్పుడు వారికి ఈ విషయాలనే చెప్పేవారు. కాగా, రామయ్య ప్రధానమంత్రులు, పలువురు ముఖ్యమంత్రుల నుంచి ప్రశంసలు పొందారు. నాటి చంద్రబాబు నాయుడుతో పాటు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా సత్కారాలు పొందారు. 2013 ఏప్రిల్ 8న బెంగుళూరుకి చెందిన అకాడమీ ఆఫ్ యూనవర్సల్ గ్లోబల్ పీస్ అనే సంస్థ వారు వనజీవి రామయ్యకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. నాటి ప్రధాని పీవీ నరసింహారావు, ఉమ్మడి ఏపీలో సీఎంలు చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, తెలంగాణలో మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి, నాటి గవర్నర్ సుశీల్‌కుమార్ షిండే చేతుల మీదుగా రామయ్య ప్రశంసలు, సన్మానాలు అందుకున్నారు. 2017లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ అందుకున్నారు. 2018లో మంత్రి తుమ్మల స్వయంగా రామయ్య ఇంటిక వెళ్లి డబుల్‌బెడ్రూం ఇల్లు కట్టించి ఇచ్చారు.

## జమిలి ఎన్నికలతో సుస్థిర పాలన

### ఎందుకు వ్యతిరేకిస్తున్నారో అర్థం కావడంలేదు: వెంకయ్య

తిరుపతి, ఏప్రిల్12,ప్రజావినికిడి:: 'ఐదేళ్ల పాటు ఏదో ఒక ఎన్నికల గురించి వ్యూహాలు పన్నుకుంటూ, ఎన్నికల మూడ్‌లోనే ఉంటే అభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది. ఒకసారి గెలిస్తే ఐదేళ్లు స్థిరంగా ఉండి, అభివృద్ధి చేస్తామన్న భరోసా కూడా రాజకీయ పార్టీలకు వస్తుంది. అప్పుడే గట్టి నిర్ణయాలు తీసుకోగలుగుతారు. జమిలి ఎన్నికలతోనే ఇది సాధ్యమవుతుంది' అని మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయడు అన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రాముఖ్యత, సవాళ్లు, ప్రభావం వంటి అంశాలపై శనివారం ఉదయం తిరుపతిలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జమిలి ఎన్నికల గురించి సుదీర్ఘంగా ప్రసంగించారు. ఏకకాల ఎన్నికలు మనకు కొత్తేమీ కాదన్నారు. 1952, 1957, 1962, 1967 సంవత్సరాల్లో పార్లమెంటు, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు జరిగాయని గుర్తుచేశారు. ప్రస్తుతం రాజకీయ కారణాల వల్లే కొన్ని పార్టీలు జమిలి ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయన్నారు. సగటు భారతీయ ఓటరు తెలివి, వివేచనను తక్కువ అంచనా వేయవద్దని పార్టీలకు విజ్ఞప్తి చేశారు.

జమిలి ఎన్నికలతో సమయం మిగులుతుందని, ఖర్చు తగ్గుతుందని, మిగిలిన నిధులను సంక్షేమం, అభివృద్ధికి వినియోగించవచ్చని చెప్పారు. కాగా, పార్టీ ఫిరాయింపుల చట్టాన్ని పూర్తిగా మార్చాలని వెంకయ్య కోరారు. ఏ పార్టీ తరపున ఎన్నికయ్యారో ఆ పార్టీ నచ్చకపోతే పదవికి కూడా రాజీనామా చేసేలా చట్ట సవరణ చేయాలన్నారు. విద్య, వైద్య సౌకర్యాలు మినహా ఏది ఉచితంగా ఇస్తామని చెప్పినా, ఎవరు చెప్పినా అది అనుచితమేనని అన్నారు.

## రేపటి నుంచి భూ భారతి

హైదరాబాద్, ఏప్రిల్12,ప్రజావినికిడి:-భూభారతి లోగో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంత గొప్ప టెక్నాలజీ అయినా ప్రజలకు కనిపించదని, ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా లోగోను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. భూపరిపాలనలో భాగంగా ఈ నెల 14న 'భూభారతి చట్టం-2025'తో పాటు అమలు మార్గదర్శకాలను ప్రభుత్వం అమల్లోకి తేనుంది. ప్రజల నుంచి విజ్ఞప్తుల స్వీకరణ, పరిష్కార ప్రక్రియను మూడు మండలాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టనున్నారు. ఆ తర్వాత ఆరు నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయనున్నారు. భూ సమస్యల పరిష్కారం, లావాదేవీల సమాచారం రైతులకు, ప్రజలకు సులభంగా, వేగంగా అందుబాటులో ఉండేలా భూ భారతి పోర్టల్ ఉంటుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. శనివారం భూభారతి చట్టం-2025తోపాటు మార్గదర్శకాలపై అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు పది రకాల లోగోలు ప్రదర్శించగా.. సీఎం సున్నితంగా తిరస్కరించారు. ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించేలా లోగోకు శనివారం రాత్రికల్లా తుదిరూపు కల్పించి ఆదివారం తనకు అందజేయాలన్నారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. భూభారతిని ప్రారంభించడమే కాకుండా ఆర్నెల్లపాటు నిశితంగా గమనించాలని, రోజువారీ సమీక్ష చే సి, సంస్కరిస్తేనే భూభారతి ఫలాలు ప్రజలకు అందుతాయని అన్నారు. విజ్ఞప్తులను ఆన్‌లైన్‌లో కాకుండా నేరుగా మండల కార్యాలయాల్లో స్వీకరించడం, వాటిని ఏ విధంగా పరిష్కరించాలనే అంశాన్ని ప్రయోగాత్మకంగా మూడు మండలాల్లో అమలు చేయాలని నిర్దేశించారు.

# అది రోడ్డు ప్రమాదమే

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై పోలీసుల స్పష్టీకరణ





రాజమహేంద్రవరం, ఏప్రిల్12,ప్రజావినికిడి: పాస్టర్ ప్రవీణ్ మృతికి రోడ్డు ప్రమాదమే కారణమని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టం చేశారు. ప్రమాద సమయంలో ఆయన వెళ్తున్న బుల్లెట్ హెడ్‌లైట్ పనిచేయలేదని, గంటకు 70 కిలోమీటర్ల వేగంతో పోతున్నారని అంచనా వేశామని తెలిపారు. రాజమహేంద్రవరం సమీపంలో హైవే పక్కన కంకరపైకి బండి వేగంగా వెళ్లడంతో స్కిడ్ అయి అర్ధ చంద్రాకారంలో రోడ్డు కిందకు జారి వర్షపు నీటి డ్రెయిన్‌లో పడిపోయారని ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారని వెల్లడించారు. అక్కడున్న రాయి ప్రవీణ్ ముఖానికి బలంగా తగలడంతో గాయమైందని, కిందకు పడిపోయిన క్రమంలో ఆయనపై బుల్లెట్ పడిందని నివేదిక ఇచ్చారని తెలిపారు. ఏ వాహనం కూడా ఢీకొనలేదని వివరించారు. శనివారం తూర్పుగోదావరి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన మీడియా సమావేశంలో దర్యాప్తు వివరాలను వెల్లడించారు. గతనెల 24న ప్రవీణ్ హైదరాబాద్‌లో బయల్దేరినప్పటి నుంచి రాజమహేంద్రవరం సమీపంలో మృతి చెందిన ఘటన వరకు ముఖ్యమైన సీసీ ఫుటేజీలను ప్రదర్శించి వివరించారు.

'మార్చి 24 ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసం నుంచి ప్రవీణ్ (46) బయలుదేరారు. మార్గమధ్యంలో నాలుగుసార్లు మద్యం కొనుగోలు చేశారు. పెట్రోలు బంకులతో కలిపి ఆరు చోట్ల యూపీఐ ద్వారానే డబ్బులు చెల్లించారు. చిల్లకల్లులోని వెంకటసాయి ఫుడ్ ప్లాజా ఎదురుగా హైవేపై ఒకసారి, కీసర టోల్ గేటుకు 500 మీటర్ల దూరంలో మరోసారి, రామవరప్పాడు రింగ్‌రోడ్ వద్ద మూడోసారి కింద పడిపోయారు. ఈ మూడు ప్రమాదాల్లో ఆయనకు రాపిడి గాయాలయ్యాయి. బైక్ హెడ్‌లైట్ పగిలిపోయింది. రామవరప్పాడు రింగ్ వద్ద పడిపోయిన సమయంలో ఆటో డ్రైవరు చూసి పోలీసులకు చెప్పారు. పోలీసుల సూచనతో పక్కన పార్కులో సుమారు 2గంటలు విశ్రాంతి తీసుకున్నారు. పోలీసులకు తెలియకుండా మళ్లీ బుల్లెట్‌పై బయలుదేరారు. నయారా పెట్రోలు బంకు సమీపంలో రోడ్డు పక్కన ఏడు అడుగుల దిగువున ఉన్న ఎండిపోయిన వర్షపు నీటి డ్రెయిన్‌లో పడిపోయి మృతిచెందారు. ప్రమాదం 24న రాత్రి 11.42 గంటలకు జరిగింది. ప్రవీణ్ వాహనం వెంబడి వెళ్లిన వాహనాలను పరిశీలించాం. ఈ కేసులో సుమారు 100 మందిని విచారించాం. 400సీసీ ఫుటేజీలను పరిశీలించాం. దూరం నుంచి వస్తుండడం, హెడ్‌లైట్ లేకుండా కుడి వైపున సిగ్నల్ లైట్‌తో అజాగ్రత్తగా ప్రయాణించడం వల్ల ప్రమాదం జరిగింది' అని ఐజీ వివరించారు.'ప్రవీణ్ బావ శామ్యూల్ వాలెస్ ఫిర్యాదుతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించాం. కేసు తీవ్రత దృష్ట్యా అనుభవం గల అధికారులతో సిట్ వేసి 14 రోజుల్లో వేగంగా దర్యాప్తు చేశాం. ప్రవీణ్ కుటుంబ పరువును కాపాడాల్సిన బాధ్యత సమాజంపై కూడా ఉంది. అందువల్ల కొన్ని విషయాలు వెల్లడించలేం. వదంతులు వ్యాప్తిచేసిన 11 మందిపై కేసులు పెట్టి ఒకరిని అరెస్టు కూడా చేశాం. ఈ కేసు దర్యాప్తును ఇక్కడితో ముగిస్తున్నాం. అనుమానాలపై ఎవరి వద్దనైనా ఆధారాలు ఉంటే అందజేసి సహకరించాలని కోరాం. గురువారం వరకు గడువు ఇచ్చినా ఎవరూ ఇవ్వలేదు' అని ఐజీ తెలిపారు.

'ప్రవీణ్‌ను హత్య చేశారని, మృతదేహాన్ని తీసుకొచ్చి పడేశారని అనుమానాలు వ్యక్తం చేసిన వారెవరూ తగిన ఆధారాలు సమర్పించలేదు. ఆ కోణంలోనూ దర్యాప్తు చేశాం. దర్యాప్తుపై ప్రవీణ్ భార్య సహా కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేయలేదు. పోలీసులపై వారికి విశ్వాసం ఉంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఎవరైనా ఊహాగానాలు, వదంతులు వ్యాప్తి చేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవు' అని ఐజీ హెచ్చరించారు.

'పాస్టర్ ప్రవీణ్ మార్గమధ్యంలో నాలుగుసార్లు ఆగి మొత్తం రూ.2,842 విలువ చేసే మద్యం కొనుగోలు చేశారు. 24న మధ్యాహ్నం 12.24 గంటలకు హైదరాబాద్ సిటీలోని సవేరా లిక్కర్ మార్ట్‌లో రూ.950 మద్యం కొన్నారు. మధ్యాహ్నం 3.02కు కోదాడలోని శ్రీఆదిత్య వైన్స్‌లో రూ.670, సాయంత్రం 4.56కు విజయవాడ దగ్గర రూ.872, రాత్రి 10.12 గంటలకు ఏలూరులోని నిపన్స్ టానిక్ వైన్స్‌లో రూ.350మద్యం కొన్నారు' అని తెలిపారు.

'రాజమహేంద్రవరం రూరల్‌లోని నామవరంలో బైబిల్ కాలేజీ నిర్మాణానికి ప్రవీణ్ 510 గజాల స్థలం కొనుగోలు చేశారు. నిర్మాణ పనుల నిమిత్తం లాలాచెరువులోని ఒక గదిని కూడా అద్దెకు తీసుకున్నారు. కాలేజీ నిర్మాణ అవసరాలకు బుల్లెట్‌ని రాజమహేంద్రవరంలో ఉంచడానికి ఆయన హైదరాబాద్ నుంచి దానిపై బయల్దేరారు' అని ఐజీ చెప్పారు.

# బిల్లులపై నిర్ణయానికి 3 నెలల గడువు

(మొదటి పేజీ తరువాయి)

తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్. రవి రాష్ట్రపతి ఆమోదం కోసం నిలిపి ఉంచిన 10 బిల్లులను సుప్రీంకోర్టు క్లియర్ చేసిన నాలుగు రోజుల తర్వాత ఈ తీర్పు వెలువడటం ప్రాధాన్యత సంతరించుకుంది. జస్టిస్ జె.బి. పార్దివాలా, జస్టిస్ ఆర్. మహాదేవన్ ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు ఉన్న అధికారాలను గుర్తు చేస్తూనే, బిల్లులను ఆమోదించకుండా నిరవధికంగా నిలిపి ఉంచడాన్ని కోర్టు తప్పుబట్టింది.

రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపితే, రాష్ట్రపతి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన గడువును అనుసరించాలని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆలస్యమైతే, అందుకు గల కారణాలను సంబంధిత రాష్ట్రానికి తెలియజేయాలని ఆదేశించింది. కేంద్ర ప్రభుత్వం అడిగిన ప్రశ్నలకు రాష్ట్రాలు సహకరించాలని సూచించింది.గవర్నర్ బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు పంపినప్పుడు, రాష్ట్రపతి తిరస్కరిస్తే, రాష్ట్ర ప్రభుత్వం కోర్టును ఆశ్రయించవచ్చని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్‌కు బిల్లులను ఆమోదించే, నిలిపివేసే లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపే అధికారం ఉంది. అయితే, గవర్నర్ బిల్లులను ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉంచడం, సదుద్దేశంతో వ్యవహరించకపోవడం సరికాదని కోర్టు అభిప్రాయపడింది. బిల్లులను పునఃపరిశీలించిన తర్వాత తిరిగి పంపినప్పుడు, గవర్నర్ వెంటనే ఆమోదం తెలపాలని సూచించింది.రాష్ట్ర మంత్రి మండలి సలహా మేరకు గవర్నర్ పనిచేయాలని, ఒకసారి సభకు తిరిగి పంపిన బిల్లును రెండోసారి రాష్ట్రపతి పరిశీలనకు పంపకూడదని కోర్టు పేర్కొంది. గవర్నర్ బిల్లులపై నిర్ణయం తీసుకోవడానికి నిర్దిష్ట గడువు లేనప్పటికీ, ఆర్టికల్ 200 గవర్నర్‌కు బిల్లులను ఆమోదించకుండా, రాష్ట్రాన్ని నిర్లక్ష్యం చేసే అధికారం ఇవ్వదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ తీర్పు కాపీని అన్ని హైకోర్టులకు, రాష్ట్రాల గవర్నర్ల కార్యదర్శులకు పంపాలని రిజిస్ట్రీని ఆదేశించింది.

మంత్రి మండలి సలహా మేరకు బిల్లును నిలిపివేసినా లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపినా, గవర్నర్ గరిష్ఠంగా ఒక నెలలో నిర్ణయం తీసుకోవాలని సూచించింది. మంత్రి మండలి సలహాకు విరుద్ధంగా బిల్లును నిలిపివేస్తే, గరిష్టంగా మూడు నెలల్లో తిరిగి పంపాలని పేర్కొంది. పునఃపరిశీలన తర్వాత బిల్లును సమర్పిస్తే, గవర్నర్ గరిష్ఠంగా ఒక నెలలో ఆమోదం తెలపాలని కోర్టు ఆదేశించింది.

శాసనసభ ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలపడంలో జాప్యంపై తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. 2020 నాటి ఒక బిల్లుతో సహా 12 బిల్లులు గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం 2023లో సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

# బాలికలదే పైచేయి

(మొదటి పేజీ తరువాయి)

ద్వితీయ సంవత్సరంలో 80శాతం మంది బాలురు, బాలికలు 84శాతం, ప్రథమ సంవత్సరంలో బాలురు 66శాతం, బాలికలు 75శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గ్రూపుల వారీగానూ ఈసారి ఉత్తమ ఫలితాలే వచ్చాయి. జిల్లాల వారీగా సెకండ్ ఇయర్ ఫలితాల్లో 93శాతం ఉత్తీర్ణతతో కృష్ణాజిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. గుంటూరు (91%), ఎన్టీఆర్ (89%) జిల్లాలు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఇక మొదటి సంవత్సరం ఫలితాల్లో కూడా తొలి మూడుస్థానాల్లో వరుసగా కృష్ణా, గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాలే ఉండటం విశేషం. ఇక సెకండ్ ఇయర్‌లో 73శాతంతో అల్లూరి సీతారామరాజు జిల్లా, ఫస్ట్ ఇయర్‌లో 54 శాతంతో చిత్తూరు జిల్లా అట్టడుగు స్థానాల్లో నిలిచాయి. ఇంటర్ ఒకేషనల్ ఫస్ట్ ఇయర్‌లో 62శాతం, సెకండ్ ఇయర్‌లో అత్యధికంగా 77శాతం ఉత్తీర్ణత నమోదైంది. మొత్తంగా అన్ని యాజమాన్యాల కాలేజీల్లోనూ గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం భారీగా పెరిగింది.

### విద్యార్థులకు సీఎం అభినందనలు

ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. గత దశాబ్ద కాలంలో ఉత్తీర్ణతలో అద్భుతమైన మెరుగుదల కనిపించడం ఆనందంగా ఉందన్నారు. తరగతుల



వారీగా వాట్సాప్ గ్రూపులు, కేర్‌టేకర్ సిస్టమ్ వంటి గేమ్ ఛేంజింగ్ సంస్కరణలను విద్యారంగంలో తీసుకురావడం వల్లే విద్యార్థులు అద్భుతాలు ఫలితాలు సాధించారని చంద్రబాబు పేర్కొన్నారు.

### మే 12 నుంచి సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను మే 12 నుంచి 20 వరకు నిర్వహించనున్నట్లు ఇంటర్మీడియట్ బోర్డు తెలిపింది. అలాగే అవే తేదీల్లో విద్యార్థులు ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు కూడా హాజరుకావచ్చని పేర్కొంది. ఈ నెల 15 నుంచి 22లోగా సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తు చేసుకోవడానికి గడువుగా పేర్కొది. అలాగే ఈ నెల 13 నుంచి 22 వరకు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించింది.

### ప్రభుత్వ జూనియర్ కాలేజీల సత్తా

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు వచ్చాయి. గత దశాబ్దకాలంలో ఎన్నడూలేని విధంగా ఉత్తమ గణాంకాలు నమోదయ్యాయి. ఫస్టియర్ పరీక్షలకు 50,314 మంది హాజరవగా 23,799 మంది(47%) పాస్ అయ్యారు. అలాగే రెండో సంవత్సరంలో 39,783 మందికి గాను 27,276 మంది(69%) ఉత్తీర్ణులయ్యారు. 2014 నుంచి పరిశీలిస్తే ప్రభుత్వ కాలేజీలకు ఇవే అత్యుత్తమ గణాంకాలు. 2024లో ఫస్టియర్‌లో కేవలం 38శాతం మంది, సెకండియర్‌లో 58శాతం మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు దోహదం చేశాయి. ఈ ఏడాది నుంచి ఇంటర్ బోర్డు విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తోంది. మధ్యాహ్న భోజన పథకాన్ని పునరుద్ధరించింది. 217 కాలేజీలకు ప్రిన్సిపాళ్లను నియమించింది. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల ఆధారంగా ఏ,బీ,సీ కేటగిరీలుగా వర్గీకరించి వెనకబడిన వారిపై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ చర్యలతో ప్రభుత్వ కాలేజీల్లో ఉత్తమ ఫలితాలు నమోదయ్యాయి. ఈ విభాగంలో రెండో సంవత్సరంలో పార్వతీపురం మన్యం (81%), గుంటూరు(76%), అన్నమయ్య (76%)తో టాప్‌లో ఉండగా... విశాఖపట్నం(55%), అనకాపల్లి (61%), బాపట్ల(63%) అట్టడుగున ఉన్నాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
ఆదివారం 13 ఏప్రిల్ 2025

# కామినేని వైద్య కళాశాల అధ్యాపకురాలికి డాక్టరేట్..



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** హైదరాబాద్ నగరంలోని కామినేని వైద్య కళాశాల లోని ఫార్మకాలజీ విభాగం లో గత పన్నెండేళ్ళుగా అధ్యాపకురాలిగా సేవలందిస్తున్న శ్రీమతి అక్కపెద్ది నాగతేజ పావని,సవీతా విశ్వవిద్యాలయం లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డి.షీలా పర్యవేక్షణలో "ఎవాల్యుయేషన్ అఫ్ హైపోలిపిడెమిక్ ఆక్టివిటీ అఫ్ కలాన్చొ పిన్నట అండ్ ఫికస్ రేసిమోసా ఇన్ విస్టార్ ఆల్బినో రాట్స్"అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పట్టా పొందారని సోమవారం వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగతేజ పావని మాట్లాడుతూ,తన పరిశోధన మనకు సాధారణంగా కనిపించే రణపాల మరియూ మేడి ఆకులు అలాగే పండ్లనుండి గ్రహించిన సారంలోని మూలికా గుణాలని,విస్టార్ అల్బినో మూషికాల లిపిడ్ స్థాయిలను తగ్గించడంలో విజయవంతంగా పరీక్షించగలిగినట్లు తెలిపారు.ఈ పరిశోధన ఫలితాలు ప్రస్తుతం మానవాళికి పెనుముప్పు గా పరిణమించిన ఊబకాయం, మధుమేహం లాంటి సమస్యలకు సరైన పరిష్కారాలు కనుగొనే దిశలో ఎంతో తోడ్పడగలవని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.తాము మిద్దె పంటగా పెంచుకున్న రణపాల లాంటి మొక్కల్లో ఇలాంటి ఔషధ గుణాలు ఉన్నాయని తేలడం పట్ల ఆవిడ ఎంతో హర్షం వ్యక్తం చేశారు. డాక్టర్ నాగతేజ పావని,డిసెంబర్ 21, 1987 లో,మహబూబ్ నగర్ లోని ఒక మధ్య తరగతి కుటుంబం లో జన్మించారు.ఆవిడ భర్త,తల్లి దండ్రులు, అత్త మామలు, సన్నిహిత బంధువులు అంతా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టడం ఓ విశేషం.తల్లి సువర్ణ, తండ్రి మాధవశర్మ ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల నుండి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు. భర్త సందీప్, నగరంలోని ఓ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పని చేస్తున్నారు. వీరిరువురికీ ఓ కూతురూ,కొడుకూ ఉన్నారు. డాక్టర్ నాగతేజ పావని విద్యాభ్యాసం అంతా మహబూబ్ నగర్ లోనే సాగింది.పదవ తరగతి వరకూ ప్రభుత్వ మోడర్న్ హై స్కూల్ లోనూ, ఇంటర్మీడియట్ న్యూవిజన్ జూనియర్ కళాశాల లోనూ, బి.ఎస్సీ (బయోటెక్నాలజీ) స్వామీ వివేకానంద డిగ్రీ కళాశాల లోనూ, ఎమ్మెస్సీ (మెడికల్ ఫార్మకాలజీ) ఎస్వీఎస్ మెడికల్ కళాశాల లోనూ పూర్తి చేసిన ఆమె 2014 వరకూ అక్కడే పనిచేసి, వివాహానంతరం అప్పటినుండీ ఇప్పటి వరకూ హైదరాబాద్ లోని ఎల్బీనగర్ లో గల కామినేని మెడికల్ కాలేజీలోనే సేవలందిస్తున్నారు.



# పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్ కు పలు సమస్యలపై వినతి పత్రం అందజేత..

## సహదేవ్ సింగ్ నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు..



**ప్రజావినికిడి,(నాగోల్):** నాగోల్ డివిజన్ లోనిపత్తుల్లా గూడ లో ఉన్నసహదేవ్ సింగ్ నగర్ కాలనీ కొత్తగా అభివృద్ధి చేయబడిన కాలనీ ముఖ్యంగా డ్రైనేజీ లేకపోవడం వల్ల ఈ ప్రాంత ప్రజలు నాన ఇబ్బందులకు గురవుతున్నారు.సెప్టిక్ ట్యాంకులపై ఆధారపడి ఉంటున్నారు.సెప్టిక్ ట్యాంకులు నిండిపోవడంతో ఈప్రాంత ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. కావున మా కాలనీకి సమగ్ర డ్రైనేజీ పైప్లైన్ సొల్యూషన్ త్వరితగతిన అందించాలని కోరుకుంటున్నాముఅదేవిధంగా సెప్టిక్ ట్యాంకులు తొందరగా నిండిపోవడం తో ఇబ్బందులకు గురవుతున్నాము అని కాలనీవాసులు వాపోతున్నారు. అలాగే మంచినీటి సరఫరాను కూడా ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.మంత్రి సానుకూలంగా స్పందించి మీ ప్రాంతానికి వచ్చి మీ సమస్యలపై అతి తొందరలో మీ సమస్యను తీరుస్తానని మంత్రి ఈటల రాజేందర్ కాలనీవాసులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు ఉన్నారు.

# రాజీవ్ యువ వికాస పథకం దూదేకులకు కూడా కేటాయించాలి..



ప్రజావినికిడి, (హైదారాబాద్): హైదరాబాద్ హజ్ హౌస్ తెలంగాణ రాష్ట్ర దూదేకుల అధ్యక్షులు మహమ్మద్ అజీమొ ద్దీన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్ల కోత్వాల్ ను కలిసి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా మైనారిటీలకు 840 కోట్ల రూపాయలు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. మంజూరు చేసిన నిధులను నూర్బాస్ దూదేకుల బీసీ బి మైనారిటీలకు పెద్ద మొత్తంలో కన్సిడర్ చేసి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.వీరి వెంట రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ అజీం బాయ్,అహ్మద్ హుస్సేన్,గ్రేటర్ హైద్రాబాద్ ప్రెసిడెంట్ మోహినొద్దీన్ పాషా, ఉపాధ్యక్షులు సమద్, నిజామాబాద్ ప్రెసిడెంట్ షాదుల్లా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ రాజ్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ, నిష్పాక్షికంగా వార్తలు రాయాలి...

**బాధ్యతతో కూడిన జర్నలిజం చేయాలి..**
**నమ్మకం పోతే గౌరవం సమాజంలో ఉండదు.**
**జర్నలిస్ట్ లు సంఘటితం కావాలి..**
**సుప్రీం కోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్ వి రమణ..**
**విజయవాడలో ఉత్తమ జర్నలిస్ట్ లకు ఉగాది పురస్కారాల ప్రధానం..**



సుప్రీం కోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్ వి రమణ చేతులమీదుగా శనివారంరోజు విజయవాడ తుమ్మపల్లి కళాక్షేత్రం లో ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు తీసుకున్న బాపట్ల కృష్ణమోహన్ (ప్రజాసంకల్పం) బాపట్ల పుష్పలత...

**ప్రజావినికిడి,(హైదరాబాద్):** ఏ వార్త అయినా నిజాయితీతో రాయాలని,వార్త నిష్పాక్షికంగా ఉండాలని,విలేకరులు బాధ్యతతో కూడిన జర్నలిజం చేయాలని సుప్రీం కోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్ వి రమణ అన్నారు.తెలుగు జర్నలిస్ట్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని తుమ్మల పల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో జరిగిన జర్నలిస్ట్ లకు ఉగాది పురస్కారాల ప్రధాన కార్యక్రమానికి ఆయన చీఫ్ గెస్ట్ గా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఏ వృత్తి, ఉద్యోగం అయినా గౌరవం ఉండాలన్నారు.వృత్తి పట్ల ఎంత నిబద్ధతతో పని చేస్తున్నామో ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. విలేకరులు సమాజ హితం కోసం ఉపయోగ పడే వార్తలు రాయాలని సూచించారు.నిజం లేని వార్తలు రాస్తే సమాజంలో గుర్తింపు ఉండదన్నారు. హక్కుల గురించి అడిగే టపుడు బాధ్యతలు గుర్తించాలలని ఉద్బోధించారు. విలేకరులు వార్తలో వాడే భాష గౌరవంగా, హుందా తనంగా ఉండాలని చెప్పారు. తెలుగు జర్నలిస్ట్ లు అందరికీ అర్థం అయ్యేలా భాష వాడకన్నారు.టీ వీ చానల్స్ వచ్చాక ఊహా జనిత వార్తలు ఎక్కువ వస్తున్నాయన్నారు. ఇది మంచి పద్ధతి కాదనీ,క్వాలిటీ వార్త లు రాసే జర్నలిస్ట్ లు పెరగాలన్నారు.ఆయా రంగాల జర్నలిస్ట్ లు సంబంధిత అంశాలపై సంపూర్ణ అవగాహన పెంచుకున్నా తర్వాతే రంగంలో దిగాలన్నారు. 99 శాతం మంది జర్నలిస్ట్ లు ఉండేందుకు ఇల్లు లేక పిల్లల్ని చదివించ లేక ఇబ్బంది పడుతున్నారన్నారు.కొద్ది మంది జర్నలిస్ట్ లకు ఎక్కువ సంఘాలు అవసరం లేదన్నారు.సంఘటిత శక్తి గా ఉంటేనే హక్కుల పరిరక్షణ, సంక్షేమం,సమస్యల పరిష్కారం సాధ్యమన్నారు. జర్నలిస్ట్ సంఖ్య ను నియంత్రించాల్సి అవసరం ఉందనీ, వృత్తి నైపుణ్యం పెంచేందుకు జర్నలిస్ట్ లకు ప్రతి ఏటా శిక్షణ అవసరం అన్నారు. వినోదం,విజ్ఞానం, అందించాల్సి జర్నలిస్ట్ ల సంఖ్య ఎంత పెరిగిందో...విమర్శలు కూడా అంతే పెరిగాయన్నారు.

### నేను జర్నలిస్టునే

తాను కూడా న్యాయవాద వృత్తిలోకి రాకముందు మొదట ఉద్యోగం జర్నలిస్ట్ గానే పని చేశాననీ సుప్రీం కోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్ వి రమణ అన్నారు. తాను వార్త పత్రికలకు వ్యాసాలు రాసేవాడిననీ ఆ క్రమంలో ఈనాడు లో సబ్ ఎడిటర్ గా పని చేయాలని ఆఫీస్ కు వెళ్ళానని చెప్పారు. ఇంటర్వ్యూ కు అటెండ్ అయితే వ్యాసాలు నువ్వే రాశావా? అని అడిగారని,తానే రాశానని చెబితే... డెస్క్ లో కాకుండా రిపోర్టింగ్ అవకాశం ఇచ్చారన్నారు. కొంతకాలం విజయవాడ సిటీ లో జర్నలిస్ట్ గా పని చేశాననిగుర్తు చేశారు. అప్పట్లో కొద్ది మంది మాత్రమే జర్నలిస్ట్ లు ఉండేవారు. ఇపుడు చాలా పెరిగారన్నారు. అప్పట్లో ఎక్కడికి వెళ్లినా చాలా మర్యాద చేసేవారని,చాలా గొప్పగా గర్వంగా ఉండేదన్నారు. ప్రముఖ సంఘ సేవకులు ఆదం నిజాం బాబా మాట్లాడుతూ, సమాజంలో రియల్ హీరో లు జర్నలిస్టు లు, వారిని సుప్రీం కోర్టు విశ్రాంత న్యాయమూర్తి చేతుల మీదుగా గౌరవించడం గొప్పవిషయమన్నారు. స్పందన ఈద ఫౌండేషన్ ఇంటర్నేషనల్ చైర్మెన్ ఈద శ్యామ్యూల్ రెడ్డి మాట్లాడుతూ, సమాజాభివృద్ధిలో జర్నలిస్ట్ ల మీద గురుతర బాధ్యత ఉంది.టీజేఎస్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడవరపు రంగనాయకులు మాట్లాడుతూ, జర్నలిస్ట్ కార్పొరేషన్ , మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి అన్నారు.

# బ్లూ రిబ్బన్ ఫేర్ కు విశేష స్పందన




**ప్రజావినికిడి, (హైదారాబాద్):** మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంపిక చేసుకోవడం ద్వారా విదేశాలలో మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని బ్లూ రిబ్బన్ వ్యవస్థాపకులు సంతోష్ కుమార్ అన్నారు.విదేశాలలో చదువుకోవాలనుకున్న విద్యార్థులు ఆయా యూనివర్సిటీకి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. హైదరాబాద్ సోమాజిగూడలోని క్షత్రియా హోటల్ లో "బిగ్గెస్ట్ స్టడి అబ్రోడ్ ఫేర్ 2025' పేరుతో ఎద్యుకేషన్ ఫెయిర్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి దాదాపుగా 32 యూనివర్సిటీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు.యు ఎస్ఏ,యూకే, న్యూజిలాండ్, యూరప్ నెదర్లాండ్ తదితర దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ ఫేర్ లో పాల్గొన్నారు.విదేశాల్లో చదువుకున్న వారికి అన్ని రకాలైన సౌకర్యాలు కల్పించేందుకు విధంగా తమ కన్సల్టెన్సీ పనిచేస్తుందని ఆయన తెలిపారు.ఆయా యూనివర్సిటీలలో విద్యార్థులకు ఏఏ కోర్సులకు ఎంత స్కాలర్షిప్ వస్తుంది అనే విషయాలతో పాటు యూనివర్సిటీలో ఉన్న సౌకర్యాల సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకుని అవకాశం ఉంటుందని వివరించారు.ప్రస్తుతం మార్కెట్లో ఏఐకి మంచి డిమాండ్ ఉందని అన్నారు.కేవలం ఈఎస్ఎల్ అని మాత్రం కాకుండా ఇతర దేశాలలో మంచి వాతావరణం తో పాటు అక్కడి వ్రతలు చాలా అద్భుతంగా ఉన్నాయని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా బ్లూ రిబ్బన్ 32 బ్రాంచ్ లు కలిగి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్లూ రిబ్బన్ డైరెక్టర్ రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

# గావ్ ఛలో అభియానులో గూడూరు గ్రామములో పాల్గొన్న నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు..

**గ్రామాల అభివృద్ధికి,పేద ప్రలకు 5కిలోల ఉచిత బియ్యం అందిస్తున్నది మోడీ కేంద్రప్రభుత్వం..**
**మోసపూరిత వాగ్దానాలతో అధికారం లోకి వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాల అమలు పై ప్రజల్లో కాంగ్రేస్ ప్రభుత్వాన్ని నిలదీద్దాం..**






**ప్రజావినికిడి,(షాద్ నగర్):** శనివారం రోజు షాద్ నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో రాష్ట్ర బీజేపీ పార్టీ ఇచ్చినటువంటి గావ్ ఛలో బస్తీ ఛలో కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి యూవ మోర్చా స్టేట్ సెక్రటరీ ప్యాట అశోక్ అతిథిగా శనివారం రోజు గూడూరు బిజెపి పార్టీ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.గ్రామములో ని బీజేపీ కార్యకర్తలతో కలసి గ్రామములో రేషను షాప్,బస్తి దవాఖాన ను,కేంద్ర ప్రభుత్వ లబ్ధి దారులను కలసి మోడీ పథకాలను వివరించారు.ఈ సందర్భముగా మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 5 కిలో ఉచిత బియ్యం పేద ప్రజలకు ఇవ్వడం జరుగుతుంది అని గ్రామంలో సీసీ రోడ్లు,వీధి దీపాలు చిన్నపిల్లలకు అంగన్వాడీలో పౌష్టిక ఆహారం ఇవ్వడం జరుగుతుంది పిఎం కిసాన్ యోజన లో భాగంగా సంవత్సరానికి 6000 రూపాయలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతి రైతులకు ఇవ్వడం జరుగుతున్నది అని గ్రామంలో పర్యటిస్తూ ప్రజలకు తెలియజేయడం జరిగింది.అనంతరం జరిగిన కార్యకర్తల సమావేశములో కార్యకర్తలతో నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాలలో ప్రజలు బీజేపీ వైపు సానుకూలంగా చూస్తున్నారని కాంగ్రేస్ పార్టీ పచ్చి అబద్ధాలతో 6గ్యారెంటీలు 420 హామీలు లతో అధికారంలోకి వచ్చి ప్రజలను పూర్తిగా మోసం చేసిందని,కాంగ్రేస్ మోసపూరిత హామీలపై ప్రజల్లో బలముగా తీసుక వెళ్లాలని అన్నారు.
కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరణ చేసి పేద ముస్లిములకు అనేక మంది హిందువుల భూములు,ఆస్తులకు రక్షణ తెస్తే కాంగ్రేస్,బి ఆర్ఎస్ పార్టీలు కొంత మంది ముస్లిములకు వంతున పడుతూ ద్రోహానికి పడుతున్నారని,బీజేపీ విషం చిముతున్న కాంగ్రేస్ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధానాలను ప్రజలోకి తీసుక వెళ్లాలని మార్గదర్శనం చేశారు. ఈ కార్యక్రమం గ్రామ అధ్యక్షుడు దిలీప్ అధ్యక్షత వహించడం జరిగినది ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి కొత్తూరు మండల్ బిజెపి జెనరల్ సెక్రెటరీ గట్టు శివలింగం కొత్తూరు మండల్ సోషల్ మీడియా కన్వీనర్ వరుణ్ గౌడ్ గూడూరు విలేజ్ మాజీ అధ్యక్షులు రాఘవేందర్ ముదిరాజ్ అలాగే రమేష్ గౌడ్ బిజెపి సీనియర్ నాయకులు నాయకులు అదేవిధంగా కొత్తూరు మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు మధుసూదన్ అలాగే బీజేపీ సీనియర్ నాయకులు శ్రీకాంత్ గౌడ్ మల్లాపూర్ బూత్ అధ్యక్షుడు పాండురంగ రెడ్డి గూడూరు బిజెపి జన సెక్రెటరీ జైహిందర్ గౌడ్ మరియు కొత్తూరు మండల్ బీజేవైఎం జనరల్ సెక్రెటరీ ప్రశాంత్,మల్లాపూర్ బిజెపి సీనియర్ నాయకులు పాండురంగ రెడ్డి,అభి యాదవ్,గుండు వసంత్ గట్టు అనిల్ సాయి ఆనంద్ ముదిరాజ్ ప్రవీణ్ ముదిరాజ్ పవన్ కుమార్ జస్వంత్ తదితరు బిజెపి కార్యకర్తలు పాల్గొనడం జరిగినది.

## శ్యాం బాబా హనుమాన్ దేవాలయాన్ని దర్శించుకున్న గౌతమ్ రావు..



ప్రజావినికిడి,(అంబర్ పేట్): హనుమాన్ జయంతిని పురస్కరించుకొని వీరన్న గుట్ట కాచిగూడ శ్రీ శ్యాం బాబా మందిర్లో నెలకొని ఉన్న హనుమాన్ దేవాలయాన్ని హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ ఎన్ గౌతమ్ రావు, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం బిజెపి సంయుక్త కన్వీనర్ ఏడెల్లి అజయ్ కుమార్ కలసి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రతి ఒక్క భక్తుడు హనుమాన్ జయంతి శోభాయాత్రలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. హిందువులను ఐకమత్యం చేయడం ఇలాంటి పండుగల తోటే సాధ్యమవు తుందని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శోభాయాత్రను విజయవంతంగా జరుపుకోవాలని తెలిపారు. దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరారు.

## ప్రసన్నాంజనేయ స్వామి ఆశీస్సులు

# ప్రతి ఒక్కరిపై ఉండాలి.

### ఆలయ ఫౌండర్ చైర్మన్ గుంటి లక్ష్మణ్..



**ప్రజావినికిడి, (ఎల్బీనగర్):ఏప్రిల్ 12** ,ప్రసన్నాంజనేయ స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆలయ ఫౌండర్ చైర్మన్ గుంటి లక్ష్మణ్ అన్నారు.హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం నాడు ఎల్బీనగర్ లోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ఆలయ ఫౌండర్ చైర్మన్ గుంటి లక్ష్మణ్ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ఆ వీరాంజనేయ స్వామి దివ్య ఆశీస్సులు పొందడం జరిగింది. హనుమాన్ జయంతి పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు అర్చనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రేమ్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవ కార్యక్రమం..

### రథోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న: ఎమ్మెల్సి నాగరకుంట నవీన్ రెడ్డి..



ప్రజావినికిడి,(షాద్ నగర్):
కలియుగ వైకుంఠధామునికి సంబంధించిన అనేక భక్తి కార్యక్రమాలు భక్తులకు కనుల విందును కలిగిస్తుంటాయి. కలియుగ వైకుంఠ నాథుడు శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు, బ్రహ్మోత్సవాల సందర్భంగా జరిగే రథోత్సవం కలియుగ కళ్యాణాన్ని కోసం జరిగే విధంగా ఉండడంతో అశేషమైన భక్తజనులు హాజరై రథోత్సవాన్ని తిలకించి ఆ వైకుంఠధాముని కృపకు పాత్రులు అవుతూ ఉంటారు. షాద్ నగర్ లోని జానంపేట శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా చేపట్టిన రథోత్సవ కార్యక్రమనికి ఎమ్మెల్సి నవీన్ రెడ్డి హాజరయ్యారు. రథోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ నాగర్ కుంట నవీన్ రెడ్డి రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించి భక్తి పరవశులయ్యారు. ఈ కార్యక్రమం లో మాజీ కౌన్సిలర్లు మరియు బీఆర్ఎస్ నాయకులు బచ్చల నరసింహులు,కానుగ అనంతయ్య,పిల్లి శేఖర్,చిన్న యాదగిరి,భాస్కర్ గౌడ్,చేరకు శివ,మంగ శ్రీశైలం,సాయి,పాండు, పిట్టల మల్లేష్,కొండే మల్లేష్,దినేష్ సాగర్ సుధీర్, మధు,నూకల నార్సిమా,భూషం బాలరాజ్,క్రిష్ణ,మంగ శేఖర్,రవి,లడ్డు,మల్ రెడ్డి,గొడుగు శ్రీశైలం,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.4

## హనుమాన్ జయంతి వేడుకలు..




ప్రజావినికిడి,(క్రొత్తపేట):
శనివారం రోజు భజంగబలి శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా కొత్తపేట డివిజన్ మోహన్ నగర్ చౌరస్తాలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ,అందరికీ హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. మరియు భక్తులకు ప్రసాదం,మజ్జిగ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు కార్యకర్తలుతదితరులు పాల్గొన్నారు.

## కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం లో

### ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్సీ కవిత..ఎమ్మెల్యే సుదీర్ రెడ్డి..





**ప్రజావినికిడి,(ఎల్బీనగర్):** హనుమాన్ జయంతి సందర్భంగా కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ శ్రీమతి.కవిత అదేవిధంగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వీరితోపాటు బిఆర్ఎస్ కార్యకర్తలు ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీనగర్ కాలనీలో హనుమాన్ జయంతి వేడుకలు..

### హనుమాన్ జయంతి వేడుకలకు హాజరైన ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్ రెడ్డి..

### కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొందుటి నరేందర్,మాజీ కౌన్సిలర్ ప్రేమలత యుగంధర్ కాలనీ వాసులు..

### అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన కౌన్సిలర్ ప్రేమలత యుగేందర్ కాలనీ వాసులు..





ప్రజావినికిడి,(షాద్ నగర్):
శ్రీరామ బంటుగా, నిరంతరం శ్రీరామ నామాన్ని జపించి రామ భక్త హనుమాన్ గా పేరుగాంచిన శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాలు నేడు అంతటా ఘనంగా జరుగుతున్నాయి. ఈరోజు షాద్నగర్ పట్టణంలో శ్రీనగర్ కాలనీలో హనుమాన్ దేవాలయం వద్ద హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా జరిపి,అత్యంత భక్తి ప్రపత్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి కూడా హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొని హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురోహితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా పురస్కరించుకుని మాజీ కౌన్సిలర్ ప్రేమలత యుగంధర్ మరియు కాలనీవాసులు ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని గావించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి శ్రీరామ నామ జపాన్ని ఎవ్వరూ లెక్కించలేనన్ని కోట్ల సార్లు హనుమంతుడు జపించాడని,ఆయన హృదయము నిండా శ్రీరాముని రూపాన్ని నింపుకున్నాడని, రాముని మించిన దేవుడు లేడు హనుమంతుని మించిన భక్తుడు లేడు అని చెప్పే విధంగా హనుమంతుని జీవితం రాముని తో పెనవేసుకున్నదని చరిత్ర చెబుతుందని, ఇప్పటికీ చిరంజీవిగా హనుమంతుని నామమే హిందువుల మనసుల్లో మెదులుతుందని, హనుమాన్ నామ జపం వలన మనుషుల మనసుల్లో భయం వీడుతుందని,ఒక్క హనుమంతుని జపం వలననే శ్రీరాముని సేవించినంత భాగ్యం కలుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమం లోమున్సిపల్ చైర్మన్ నరేందర్,మాజీ కౌన్సిలర్లు ప్రేమలత యుగేందర్,పిల్లి శారద శేఖర్,జూపల్లి కౌసల్య శంకర్,మానస యాదగిరి,బీసీ మహిళా నాయకురాలు వరలక్ష్మి,
బిఆర్ఎస్ నాయకులు చీపిరి రవి యాదవ్, దినేష్ సాగర్ కాలనీ వాసులు గన్నోజ అంజయ్య, మొనప్ప,యాదగిరి చారి,నరసింహ చారి, బ్రహ్మం,శివ శంకర్, బాలరాజ్ యాదవ్, జయపాల్ రెడ్డి, అంబురావు,జనార్దన్ గౌడ్,లక్ష్మణ్, రాములు,పుల్లానా చారి,భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కలియుగ భగవంతుడు శ్రీ వీరాంజనేయుడు

## బీఆర్ఎస్ యువ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్

### శ్రీనగర్ కాలనీ హనుమాన్ దేవాలయం,ఉత్తర భారతీయ సమాజ్ హనుమాన్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న మురళీకృష్ణ యాదవ్,మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్,వైస్ చైర్మన్ నటరాజ్,బీఆర్ఎస్ నాయకులు..





ప్రజావినికిడి,(షాద్ నగర్):కలియుగ భగవంతుడు హనుమంతుడని బీఆర్ఎస్ యువనాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్ అన్నారు.శనివారం షాద్ నగర్ మున్సిపాలిటీ శ్రీనగర్ కాలనీ హనుమాన్ దేవాలయం,ఉత్తర భారతీయ సమాజ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొనే పూజలు చేసిన అనంతరం మాట్లాడారు.శ్రీ హనుమంతుని పూజ చేయడం వల్ల సకల శుభాలు కలుగుతాయని,అన్ని వర్గాల ప్రజలు తమ ఇష్టా దైవాన్ని ప్రార్థిస్తే మానసిక ప్రశాంతత కలుగుతుందని అభిప్రాయపడ్డారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలను నిరంతరం పాటించాలని,హిందూ ధర్మానికి కట్టుబడి ఉండాలని ఆకాంక్షించారు. హనుమాన్ జయంతి ఉత్సవాలు నిర్వహించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ నరేందర్,వైస్ చైర్మన్ నటరాజ్,నాయకులు యుగంధర్,పిల్లి శేఖర్, జూపల్లి శంకర్,చీపిరి రవి యాదవ్,చిన్న యాదగిరి,అంచ రాజు, సత్యనారాయణ, గుండు అశోక్, నవీన్ పులిజాల, రాఘవేందర్ గౌడ్, సందీప్ సింగ్,చెర్క శివ,వినోద్,వెంకటేష్ గుప్తా,గుడ్డు యాదవ్, సంతోష్ నాయక్,శీలం శ్రీకాంత్, రాజశేఖర్, అభిలాష్,తేజ యాదవ్,సాయితేజ, శివ నాయక్ తదితరులు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

## శ్రీ చైతన్య విద్యార్థులకు నాసా విశ్వదారలో

## జాతీయ బహుమతి ఉటోపియంలో రాష్ట్ర బహుమతి



**ప్రజావినికిడి,(షాద్ నగర్):**స్థానిక షాద్ నగర్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో నాసా స్పేస్ సెటిల్మెంట్ కాంటెస్ట్ 2025 నిర్వహించిన ప్రతిష్టాత్మక విశ్వధార ప్రాజెక్టులో అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి జాతీయస్థాయిలో ప్రథమ బహుమతిని గెలుచుకున్నారు. ఈ విజయం వారు గత ఆరు నెలలుగా చేసిన కృషి ఆవిష్కరణాత్మక ఆలోచనల ఫలితం విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాజెక్టును విజయవంతంగా పూర్తి చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఆనంద్ మాట్లాడుతూ, ఈ పోటీ నాసా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించబడింది. వేలాది స్కూల్లకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.ఈ పోటీలో శ్రీ చైతన్య విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు.అందులో ఆరు గ్రూపులుగా విభజించారు. రెండు గ్రూపులు ఎంపికైనాయి.ఈ పోటీలో శ్రీ చైతన్య విద్యార్థులు తమ ప్రత్యేకతను చాటుతూ జాతీయస్థాయిలో మొదటి బహుమతిని సాధించడం గర్వకారణం అని తెలిపారు. ప్రాజెక్టులో పాల్గొన్న విద్యార్థులు అతిథి, తేజ్ దీప్,సాయి ప్రణీత్ సాగర్,అద్వైత్, హాసినిప్రియ ,గౌతమ్ రెడ్డి, భవాని,సుదీప్ రాజ్,స్పందన, పాల్గొన్నారు.

**ఉటోపియన్ ప్రాజెక్టుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు శ్రీ చైతన్య విద్యార్థులకు మూడవ బహుమతి**

శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు రూపొందించిన ఉటోపియన్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. దీనికి గుర్తింపుగా విద్యార్థులు మూడో బహుమతిని అందుకున్నారు.

పాల్గొన్న విద్యార్థులు సాయి వర్షిని , విగ్నేష్,ఎం.వేదాంత్, హర్షిత్,గోపి ప్రియ, కేదార్నాథ్,మణికంఠ గౌడ్,రిషిత,ఉదయశ్రీ పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రాజెక్ట్ నిర్మాణాత్మకంగా రూపుదిద్దేందుకు నాసా ఇంచార్జ్ ఉపాధ్యాయ బృందం ప్రత్యేక సహకారం అందించారు.వీరు కలిసి చేసిన సమిష్టి కృషి ఆవిష్కరణాత్మక ఆలోచనలు శాస్త్రీయ దృష్టి కోణం విశ్వధార, ఉటోపియన్, ప్రాజెక్టును విజయవంతం చేశాయి.విద్యార్థుల విజయం పట్ల పాఠశాల యాజమాన్యం మరియు తల్లిదండ్రులు హర్షం వ్యక్తపరిచారు. ఈ విజయం భవిష్యత్తులో అంతర్జాతీయ అవకాశాలకు మార్గం సుగమం చేస్తుందని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, డైరెక్టర్ మల్లెంపాటి శ్రీవిద్య మేడం,ఏజిఎం భాస్కర్ రెడ్డి,పాఠశాల ప్రిన్సిపల్ ఆనంద్,డీన్ వీర కృష్ణ ,సి బ్యాచ్ ఇంచార్జ్ సైదులు,నాసా ఇంచార్జ్ సాయికిరణ్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## చత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

### ముగ్గురు మావోయిస్టులు మృతి



ఏప్రిల్12,ప్రజావినికిడి:
%చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యం మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లుతోంది. చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ఇటీవల ప్రకటించినప్పటికీ వారి కోసం భద్రతా దళాలు సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగిస్తూనే ఉన్నాయి. తాజాగా శనివారం ఉదయం ఇంద్రావతి నేషనల్ పార్క్ ఏరియా అభయారణ్యం దట్టమైన అడవుల్లో నక్సలైట్లు నక్కి ఉన్నారనే నిఘా వర్గాల పక్కా సమాచారం మేరకు డిఆర్జి బీజాపూర్, డిఆర్జి దంతవాడ, ఎస్టిఎఫ్, కోబ్రా బెటాలియన్లు 210, 202 సంయుక్త బృందాలు ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడటంతో ఒక్కసారిగా ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఎన్‌కౌంటర్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు బీజాపూర్ ఎస్పి జితేంద్ర యాదవ్ తెలిపారు. ఇంకా పెద్ద సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందే అవకాశం ఉందని, ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

# అంగరంగ వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

### చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో వైభవంగా జయంతి వేడుకలు

### ప్రత్యేక పూజలు, భజనలు పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

### ఎల్కుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం





**ప్రజావినికిడి,(షాద్ నగర్):** శ్రీరామ భక్త హనుమాన్ జయంతిని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటి పరిధిలోని సోలిపూర్ చౌడమ్మగుట్ట శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భజన భక్త బృందం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు.శ్రీ ఆంజనేయస్వామి విగ్రహాన్ని పల్లకిలో మోస్తూ శ్రీరామ జయరామ,జయ జయ రామ నినాదాలతో ఆట పాటలతో,భజనలతో భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు.భక్తి పాటలు భజనలతో ఆలయంలో శ్రీ రామ నామస్మరణతో మార్మోగింది.ఆలయ ప్రధాన అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్ర చార్య, అర్చకులు కృష్ణ, ప్రమోద్,సునీల్ పంతులు ఆధ్వర్యంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు పట్టణానికి చెందిన ఎల్కుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పులిమామిడి లతా శ్రీ శ్రీశైలం గౌడ్, ఎం సాని నరసింహులు, అన్నారం రఘు గౌడ్, జి.వసంతరావు, గడ్డమీద రమేష్ ముదిరాజ్,శంకర్ గౌడ్,జి సతీష్,కిషన్ నాయక్,రాఘవేందర్, నారాయణ,వీర్లపల్లి కృష్ణయ్య,లక్ష్మికాంత్ రెడ్డి,కృష్ణ చారి, శంకరయ్య,వీఆర్వో బచ్చన్న,యాదగిరి, పి.ప్రవీణ్ గౌడ్,పద్మా వెంకటేష్,గోరియా నాయక్,కొత్త సత్తయ్య గౌడ్,శ్రీనివాస్,రమేష్, సుధాకర్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, రవీందర్,మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య,భజన భక్త బృందం, మహిళలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District - 500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State.
Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## హైదరాబాద్ కొంపల్లిలో అతిపెద్ద మోటార్ సైకిల్స్ డీలర్‌షిప్ ప్రారంభించిన జావా, యెజ్డి,బిఎస్ఎ



**ప్రజావినికిడి,(హైదరాబాద్):** భారతదేశంలోని ఉత్సాహపూరితమైన మోటర్‌సైకిల్ బ్రాండ్ అయిన జావా యెజ్డి మోటర్‌సైకిల్స్,శనివారం రోజు హైదరాబాద్‌లో తమ అతిపెద్ద డీలర్‌షిప్‌ను కొంపల్లిలో ఘనంగా ప్రారంభించింది. కొంపల్లి లో ఏర్పాటు చేసిన ఈ సౌకర్యం, మోటర్‌సైక్లింగ్ ప్రేమికులకు విస్తృత శ్రేణి మోటర్‌సైకిళ్లు, ప్రీమియం సేవల అనుభవం, అసమానమైన కస్టమర్ అనుభవాన్ని అందిస్తుంది.కంపెనీ ఇప్పుడు హైదరాబాద్‌లో తమ 7వ డీలర్‌షిప్ - రివెక్స్‌పీరియన్స్ మోటో-ను క్లాసిక్ లెజెండ్స్ కుటుంబంలోకి స్వాగతించింది.ఈ కొత్త డీలర్‌షిప్ బ్రాండ్ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది,ఇది జావా అలాగే యెజ్డి వంటి క్లాసిక్ బ్రాండ్‌ల వాసులు నుంచి అందుకున్న ప్రేమ అదేవిధంగా ప్రతిస్పందనను ప్రతిబింబిస్తుంది.ఈ డీలర్‌షిప్ జావా, యెజ్డి మరియు బిఎస్ఎ మోటర్‌సైకిల్స్ యొక్క పూర్తి శ్రేణిని ప్రదర్శిస్తుంది. అమ్మకాలు అలాగే అమ్మకాల తర్వాత సేవలతో సహా వాహనాలకు సంబంధించిన సేవలను అందిస్తుంది. క్లాసిక్ లెజెండ్స్ సీబీఓ చరణ్ అగర్వాల్ తన సంతోషాన్ని పంచుకుంటూ , "హైదరాబాద్ మాకు ప్రాముఖ్యత కలిగిన నగరం.క్లాసిక్ మోటర్ సైకిళ్ల పట్ల ఈ నగరవాసులు చూపుతున్న ప్రేమ అపూర్వం. రివెక్స్‌పీరియన్స్ మోటోను మా కుటుంబంలోకి స్వాగతించడానికి మేము సంతోషిస్తున్నాము. ఈ కొత్త డీలర్‌షిప్ అత్యుత్తమ మోటర్‌సైక్లింగ్ అనుభవాలను అందించడంలో,జావా, యెజ్డి మరియు బిఎస్ఏ మోటర్‌సైకిళ్లకు పెరుగుతున్న డిమాండ్‌ను తీర్చడంలో మా నిబద్ధతకు నిదర్శనం" అని అన్నారు.

## పాదయాత్ర ముగింపుతో షాద్‌నగర్‌లో ఘన స్వాగతం

### పలికిన బిజెపి షాద్నగర్ నియోజకవర్గం ఇంచార్జ్ అందే బాబయ్య

### పాదయాత్ర మిత్రులకు సాక పోసిన బీజేపీ యువ నాయకుడు పసుపుల ప్రశాంత్ ముదిరాజ్

**ప్రజావినికిడి,(షాద్ నగర్):**
బీజేపీ షాద్‌నగర్ ఆధ్వర్యంలో 08-04-2025 నుండి 12-04-2025 వరకు చౌడమ్మగుట్ట నుండి యాదగిరిగుట్ట వరకు నిర్వహించిన పాదయాత్ర విజయవంతంగా ముగిసింది.ఈ పాదయాత్ర నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన సంధర్భాన్ని,అలాగే మహబూబ్‌నగర్ పార్లమెంటుకు మొట్టమొదటి మహిళా ఎంపీగా ఎన్నికైన గర్వకారణాన్ని ప్రజలతో పంచుకునే లక్ష్యంతో నిర్వహించబడింది.తెలంగాణను కాంగ్రెస్ కబంధ హస్తాల నుండి విముక్తి చేయాలని యాదగిరి నరసింహ స్వామిని ప్రార్థిస్తూ ప్రారంభమైన ఈ యాత్ర,రాష్ట్రంలో ప్రజా చైతన్యాన్ని రగిలించడంలో కీలకంగా నిలిచింది.పాదయాత్ర ముగింపు సందర్భంగా, షాద్‌నగర్ పొలిమేర వెంకటేశ్వర స్వామి గుడి వద్దకు చేరుకున్న కార్యకర్తలకు, యాత్రలో పాల్గొన్న మిత్రులకు,బీజేపీ యువ నాయకుడు



పసుపుల ప్రశాంత్ ముదిరాజ్ స్వయంగా సాక పోసి ఘన స్వాగతం తెలిపారు.వారితో మమకారంతో మెలిగి,వారి త్యాగానికి,నిబద్ధతకు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ ఉద్యమ యాత్రలో ప్రతి అడుగు పైనా వారి పాత్ర అమూల్యమని ప్రశాంత్ ముదిరాజ్ అన్నారు.ప్రజల పక్షాన బీజేపీ పోరాటం కొనసాగుతుందనీ, అభివృద్ధే బీజేపీ మార్గమనీ ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మల్చల మురళి,జమ్ముల నరసింహ గారు మల్చలం రాము తదితరులు పాల్గొన్నారు.



## వన్య ప్రాణుల దాహార్తి తీరుస్తున్న స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్..!





**ప్రజావినికిడి,(గిద్దలూరు):**
భగభగ మండే ఎండలతో,గొంతెండి పోతున్న వడగాడ్పులతో, నల్లమల అటవీ ప్రాంత మూగ జీవాలకు మంచినీళ్లు అందించే సత్ సంకల్పంతో, స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ ఆలోచనలకు ప్రతిరూపమే,శనివారం చేపట్టిన ఈ వినూత్న సేవా కార్యక్రమం, ఎందరో హృదయాలను స్పందింప చేసింది. ముఖ పుస్తక మిత్రులు, ఇతర స్నేహితుల ఆర్థిక సహకారంతో, రూపాయి,రూపాయి, చందాలను సమకూర్చుకొని, మూగజీవుల దాహార్తిని తీర్చేందుకు,గిద్దలూరు పరిధిలో విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో, గిద్దలూరు-నంద్యాల ఘాట్ రోడ్ నందు. రోడ్డుకు ఒక వైపు,పశు పక్ష్యాదులకు,వన్య ప్రాణాలు నీరు తాగేందుకు అనువైన ప్రదేశాలలో, ప్రత్యేకంగా నీటి తొట్టెలను




తయారు చేయించింది.అలా తయారుచేసిన 25 తొట్టెలందు,గిద్దలూరు అటవీ శాఖ సహకారంతో, ట్యాంకరు ద్వారా నీటిని నింపి,అవి ఖాళీ అయినపుడు మరల నింపేలా,ట్రస్ట్ వారు ఏర్పాట్లు చేశారు.ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ,తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో,ఇది ఓ వినూత్న కార్యక్రమం అని,తాము ఊహించిన దానికంటే ఎక్కువమంది మిత్రులు స్పందించి, ఆర్థిక సహకారం అందజేయడంతో,ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయడం జరిగిందని చెప్పారు. కింద కమర్షియల్ టాక్స్ శాఖలో పనిచేస్తున్న శిరిగిరి శ్రీనివాసరావు చొరవ శ్లాఘనీయమని ఆయన చెప్పారు.వారి శాఖలో పనిచేస్తున్న వారిని,వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను చైతన్యపరిచి,ఆర్థిక సహకారం అందేలా ఆయన చొరవ చూపారని చెప్పారు. మున్నూరు శ్రీనివాస్, యగటీల రంగ కుమార్ తదితర స్నేహితుల ప్రోత్సాహంతో, ఊహించిన దానికంటే ఎక్కువ ఆర్థిక సహకారం అందడం వలన,మిగులు నిధులతో,వచ్చే నెలలో మరో సేవా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నట్లు శ్రీనివాస ప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు కమర్షియల్ టాక్స్ దాఖలో సీనియర్ ఉద్యోగి, శిరిగిరి శ్రీనివాసరావు, ట్రస్టు సభ్యులు తన్నీరు బాల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ విజయోత్స దివస్ శోభాయాత్ర

### కర్మన్ ఘాట్ దేవాలయంనుండి. :జై శ్రీ రాం..



## మొక్కలే శ్వాసగా... మొక్కలే ఆశగా

### జీవించిన వనజీవి పద్మశ్రీ రామయ్య

### వనజీవి రామయ్య మృతికి పలువురు సంతాపం
### దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఇరు రాష్ట్రాల సిఎంలు

ఖమ్మం, ఏప్రిల్12,ప్రజావినికిడి:
మొక్కలే శ్వాసగా...మొక్కలే జీవితంగా..మొక్కలే ప్రాణంగా బతికిన ప్రముఖ సామాజిక కార్యకర్త, పద్మశ్రీ వనజీవి రామయ్య కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రామయ్య శనివారం ఉదయం గుండెపోటు రావడంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆయనను ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ తుదిశ్వాస విడిచారు. రామయ్య స్వస్థలం ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామం. జీవితమంతా మొక్కలు నాటి పెంచారు. కోటికిపైగా మొక్కలు నాటి సరికొత్త చరిత్ర సృష్టించారు. వృక్షో రక్షతి రక్షితః అంటూ నిత్యం ప్రచారంచేసిన ఆయన రోడ్ల పక్కన, పాఠశాలలు, దవాఖానలు, దేవాలయాల్లో మొక్కలు నాటారు. రామయ్య సేవలకుగాను 2017లో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది. రామయ్యకు భార్య, ముగ్గురు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కాగా ఇద్దరు కుమారులు ఇప్పటికే వివిధ కారణాలతో చనిపోయారు. రామయ్య మృతితో ప్రకృతి ప్రేమికులు శోక సంద్రంలో మునిగిపోయారు. రామయ్యను కడసారి చూడటానికి జనం భారీగా తరలి వచ్చారు. బీఆర్ఎస్ మాజీ ఎంపీ సంతోష్, సీఎం రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సహా పలువురు రాజకీయ నేతలు రామయ్య మృతిపట్ల సంతాపం తెలిపారు. 1937, జూలై 1న దరిపెల్లి లాలయ్య, పుల్లమ్మ దంపతులకు రామయ్య జన్మించారు. ఆయన ఇంటిపేరు దరిపల్లి రామయ్య అయినప్పటికీ వనజీవిగా మార్చుకున్నారు. ఆయనను చెట్ల రామయ్య అనికూడా పిలుస్తారు. 50 ఏండ్లుగా అలుపెరగకుండా విత్తనాలు చల్లుతూ మొక్కలు పెంచేందుకు ప్రయత్నించారు. వేసవిలో విత్తనాలు సేకరించి తొలకరి రాగానే వాటిని ఆయా ప్రాంతాల్లో చల్లుతుండేవారు. ఇలా 120 రకాల మొక్కల చరిత్రను అలవోకగా చెప్పగలరు వనజీవి. మూడు కోట్ల మొక్కలు నాటాలన్నదే తన లక్ష్యమని వనజీవి రామయ్య చెప్తుండేవారు. తెలంగాణ ప్రభుత్వం ఆరో తరగతి సాంఘీకశాస్త్రంలో వనజీవి గురించి పాఠ్యాంశంగా చేర్చింది. అదేవిధంగా మహారాష్ట్ర ప్రభుత్వం అక్కడి తెలుగు విద్యార్థుల కోసం 9వ తరగతి తెలుగు పుస్తకంలో రామయ్య జీవితం పాఠ్యాంశంగా బోధిస్తున్నది.రామయ్యకు భార్య జానమ్మ, నలుగురు సంతానం. ఓవైపు కుటుంబ భారాన్ని మోస్తూనే.. నాలుగు దశాబ్దాలకు పైగా మొక్కలు నాటుతూ వచ్చారు. మనుమళ్లు, మనుమరాళ్లకు కూడా ఆయన చెట్ల పేర్లే పెట్టారు. ఒకామె పేరు చందనపుష్ప, ఇంకో మనుమరాలు హరిత లావణ్య. కుబంధపుష్ప అని ఇంకో పాపకు పెట్టాడు. మరో మనవరాలికి వనశ్రీ అని నామకరణం చేశారు. కోటికిపైగా మొక్కలను నాటి ట్రీ మ్యాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన రామయ్య సేవలకుగాను పలు సంస్థలు అవార్డులతో సత్కరించాయి. 2005లో సెంటర్‌ఫర్ మీడియా సర్వీసెస్ సంస్థ నుంచి మనమిత్ర అవార్డులో ఇచ్చింది. యూనివర్సల్ గ్లోబల్ పీస్ అనే అంతర్జాతీయ సంస్థ ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసింది. 1995లో భారత ప్రభుత్వం నుంచి వనసేవా అవార్డు లభించింది.

వనజీవి రామయ్య మృతికి పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆయన మరణ వార్త తెలుసుకుని తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఉభయ తెలుగు రాష్ట్రాల సిఎంలు రేవంత్ రెడ్డి, చంద్రబాబు, మాజీ సిఎం కెసిఆర్ తదితరులు తీవ్ర సంతాపం తెలిపారు. పద్మశ్రీ వనజీవి రామయ్య మృతి



పట్ల తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ప్రకృతి లేనిదే మనుగడ లేదని బలంగా నమ్మిన వ్యక్తి ఆయన అని చెప్పారు. వ్యక్తిగా మొక్కలు నాటి సమాజాన్నే ప్రభావితం చేసిన వ్యక్తి రామయ్య అన్నారు. ఆయన మరణం సమాజానికి తీరని లోటు- అని పేర్కొన్నారు. రామయ్య సూచించిన మార్గం నేటి యువతకు ఆదర్శమన్నారు. వనజీవి రామయ్య మరణం పట్ల భారాస అధినేత కేసీఆర్ సంతాపం వ్యక్తం చేశారు. పచ్చదనం పరిరక్షణ కోసం వనజీవి చేసిన కృషిని స్మరించారు. ఆయన మరణంతో తెలంగాణ ఒక ప్రపంచ పర్యావరణవేత్తను కోల్పోయిందన్నారు. పర్యావరణం కోసం ఆయన చేసిన త్యాగం అసమాన్యమైనదని వివరించారు. హరితహారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆయన అందించిన సహకారం గొప్పదన్నారు. రామయ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

రామయ్య మరణ వార్త తెలిసి తీవ్ర విచారానికి లోనైనట్లు ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. పచ్చదనం ప్రాధాన్యత చెప్పిన రామయ్య నేటితరానికి ఆదర్శమని చెప్పారు. ఆయన మరణం పర్యావరణ పరిరక్షణ ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటు-న్నట్లు చెప్పారు. వనజీవి రామయ్య మరణం బాధాకరమని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే సందేశమే ఆయన జీవిత సారాంశమని పేర్కొన్నారు. చెట్ల ఆవశ్యకత చెప్పిన రామయ్యే నిజమైన పర్యావరణ యోధుడని పేర్కొన్నారు. వనజీవి రామయ్య చూపిన మార్గం భావితరాలకు ప్రేరణ అని వివరించారు.

## రూ.14 వేల కోట్ల రైతుబంధును ఎగ్గొట్టిన సర్కార్: హరీశ్‌రావు



పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని సిద్దిపేట ఎంఎల్ఎ తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలోని చిన్నకోడూరు, నంగునూర్ మండలాల్లో వడగండ్ల వానతో నష్టం జరిగిన పంట పొలాలను ఆయన శనివారం పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ సర్కార్ నిజంగా పంటల బీమా చేసి ఉంటే రైతులకు ఎంతో మేలు జరిగేదని అన్నారు. పంటల బీమా చేస్తామని బడ్జెట్‌లో నిధులు కేటాయించి సర్కార్ మొండిచేయి చూపిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఆందోళన చెందుతున్న రైతులకు కాంగ్రెస్ కనీసం భరోసా ఇవ్వలేని పరిస్థితిలో ఉందన్నారు.ఇప్పటివరకు రైతులకు 40 శాతం మాత్రమే రుణమాఫీ జరిగిందని, 60 శాతం మంది రైతులకు రుణమాఫీ జరగలేదన్నారు. రైతుబంధు కూడా సగం మంది రైతలకు అందలేదన్నారు . వానాకాలం రూ.9 వేల కోట్లు, ఈ యాసంగికి రూ.5 వేల కోట్లు మొత్తం కలిపితే రూ.14 వేల కోట్ల రైతు బంధును రైతులకు ఇవ్వకుండా ఎగ్గొట్టిందని ఆరోపించారు. గత ఎండాకాలంలో పడ్డ వడగండ్ల వానకు సిద్దిపేట నియోజకవర్గంలో 1,350 ఎకరాల్లో పంట నష్టం జరిగితే నేటివరకు ఆ డబ్బులు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. ఇటీవల కురిసిన వడగండ్లతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 వేల ఎకరాలు పంట నష్టం జరిగిందని అంచనా వేశామని అన్నారు.

**రేవంత్ రెడ్డి తప్పుడు నిర్ణయాలతో అధికారులు బలి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పుడు నిర్ణయాలతో ప్రభుత్వ అధికారులు బలయ్యే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్‌సియూలో 400 వందల ఎకరాల్లో చెట్లను నరకడానికి కారణం రేవంత్‌రెడ్డేనని అన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్య మృతి పట్ల సంతాపాన్ని తెలిపారు. రామయ్యతో పాటు ఆయన సతీమణి అడవుల పెంపకం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహానుభావులని కొనియాడారు. చెట్లు పెట్టడం రామయ్య వంతు అయితే చెట్లను నరకడం సిఎం రేవంత్ రెడ్డి వంతని ఎద్దేవా చేశారు. రేవంత్‌రెడ్డి రామయ్య మృతికి సంతాపం తెలపడమంటే హంతకుడే సంతాపం తెలుపుతున్నట్లు ఉందని వ్యాఖ్యానించారు. గతంలో చెట్లను నరకడానికి కారాణమైన అధికారుల ఉద్యోగాలు పోయి జైలుకు వెళ్లే పరిస్థితి ఏర్పడిందని గుర్తు చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ నాయకులు రాధాకృష్ణ శర్మ, మాణిక్యారెడ్డి, జాప శ్రీకాంత్ రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, కనకయ్య తదితరులు ఉన్నారు.

# రణబీర్ తో నటించాలనేది నా కోరిక



విజయ్ దేవరకొండ మూవీ 'అర్జున్ రెడ్డి' ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రం ద్వారా షాలినీ పాండే హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. తొలి చిత్రంతోనే షాలిని మంచి గుర్తింపు పొందింది. షాలినీ పాండే స్టార్ హీరోయిన్ అవుతుందని అందరూ భావించారు. అయితే ఆ తర్వాత ఆమె చేసిన సినిమాలు పెద్దగా హిట్ కాకపోవడంతో రేస్ లో ఆమె వెనుకబడిపోయింది. ప్రస్తుతం ఆమె హిందీ, తమిళ సినిమాలు, వెబ్ సిరీస్ లలో నటిస్తోంది. తాజాగా తనకు ఏ హీరోతో నటించాలని ఉందో షాలినీ పాండే ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్ తో కలిసి నటించాలనేది తన కోరిక అని షాలినీ పాండే చెప్పింది. అతని కళ్లలో ఒక ప్రత్యేకమైన ఆకర్షణ ఉంటుందని, నటనలో ఒక మాయ ఉంటుందని తెలిపింది. రణబీర్ తో కలిసి ఒక్క రోజైనా పని చేయాలనేది తన కోరిక అని చెప్పింది. ప్రతి సినిమాలో రణబీర్ నటనలో మార్పు కనిపిస్తుందని కితాబునిచ్చింది.









## జాన్వీ కపూర్‌కు బిర్లా వారసురాలు 5 కోట్ల కాస్ట్లీ గిఫ్ట్...

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ కాస్ట్లీ గిఫ్ట్ అందుకున్నారు. సుమారు రూ. 5 కోట్ల విలువైన లంబోర్ఘిని కారును ఆమె కానుకగా అందుకోవడం విశేషం. ఇంతకీ జాన్వీకు ఇంతంటి విలువైన బహుమతి ఇచ్చింది ఎవరో తెలుసా! బిర్లా వారసురాలు, ప్రముఖ వ్యాపారవేత్త కుమార్ మంగళం బిర్లా కూతురు అనన్య బిర్లా. జాన్వీ కపూర్, అనన్య బిర్లా చాలా కాలంగా మంచి స్నేహితులు. ఇటీవల అనన్య బ్యూటీ ప్రొడక్ట్స్ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. అయితే, ఈ బ్రాండ్‌కు జాన్వీ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనున్నట్లు తెలుస్తోంది. తన బ్యూటీ ప్రొడక్ట్స్ బ్రాండ్ కు జాన్వీ సహకరిస్తున్నందుకు కానుకగా అనన్య ఈ ఖరీదైన లంబోర్ఘిని కారును ఆమెకు గిఫ్ట్‌గా పంపించారని సమాచారం. శుక్రవారం ఉదయం లిలాక్ (పర్పుల్) రంగు లంబోర్ఘిని కారు జాన్వీ నివాసానికి చేరుకుంది. ఈ కారుతో పాటు మరో గిఫ్ట్ ప్యాక్ కూడా ఉంది. దానిపై "ప్రేమతో, నీ అనన్య" అని రాసి ఉంది. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా, జాన్వీ కపూర్ గతేడాది 'దేవర'తో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. తొలి సినిమాతోనే హిట్ కూడా అందుకున్నారు. ఆ తర్వాత ఈ బ్యూటీ రామ్ చరణ్, బుచ్చిబాబు సానా కాంబోలో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రంలో అవకాశం దక్కించుకుంది.



## విశ్వంభర 'రామ రామ సాంగ్' భక్తితో మెగా పాజిటివ్ వైబ్స్

మెగాస్టార్ చిరంజీవి హీరోగా వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'విశ్వంభర'. తాజాగా ఈ సినిమా నుంచి 'రామ రామ' అంటూ సాగే ఫస్ట్ సింగిల్ ను మేకర్స్ విడుదల చేశారు. ఎం.ఎం. కీరవాణి బాణీలు సమకూర్చిన ఈ పాటకు సరస్వతిపుత్ర రామజోగయ్యశాస్త్రి లిరిక్స్ అందించారు. శంకర్ మహాదేవన్, లిప్సికా ఆలపించారు. పాట వినసొంపుగా ఉండి, శ్రోతలను ఆకట్టుకోవడం ఖాయంగా కనిపిస్తోంది. శ్రీరాముడి గొప్పతనం ఈ పాటలో వివరించారు. అలాగే చిరు కూడా తనదైన గ్రేస్‌తో పాటకు డ్యాన్స్ చేయడం చూస్తుంటే ఈ సాంగ్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై వంశీ, ప్రమోద్ విక్రమ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి ఆస్కార్ అవార్డు గ్రహీత ఎం.ఎం. కీరవాణి సంగీతం, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు. సోషియో ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీలో త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇక ఇప్పటికే విడుదలైన 'విశ్వంభర' టీజర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఇప్పుడు 'రామ రామ' పాట కూడా ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలను పెంచేసింది.

## 25న విడుదల కానున్న సారంగపాణి జాతకం

టాలీవుడ్ దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి, బలగం, కోర్టు సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న నటుడు ప్రియదర్శి కాంబోలో ఒక సినిమా రూపొందుతున్న విషయం తెలిసిందే. 'సారంగపాణి జాతకం' అంటూ ఈ సినిమా రాబోతుండగా.. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో వచ్చిన జెంటిల్ మన్, 'సమ్మోహనం, చిత్రాలు నిర్మించిన శ్రీదేవి మూవీస్ బ్యానర్ ఈ సినిమాను నిర్మిస్తుంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఏప్రిల్ 18న విడుదల కాబోతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ విడుదల తేదీని కూడా వాయిదా వేసింది టీమ్. దీంతో కొత్తగా మరో విడుదల తేదీని ప్రకటించింది. ఈ మూవీను ఏప్రిల్ 25న విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించింది. ఈ సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో రూప కొడువాయూర్ కథానాయికగా నటిస్తుంది. ఈ సినిమాని శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తుండగా.. వి.కె. నరేష్. తనికెళ్ళ భరణి, అవసరాల శ్రీనివాస్, వెన్నెల కిశోర్, వైవా హర్ష, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, ప్రదీప్ రుద్ర, రమేష్ రెడ్డి, కల్పలత, రూపలక్ష్మి, హర్షిణి , కె.యల్.కె. మణి కీలక పాత్రలలో నటిస్తున్నారు.




## డియర్ ఉమ' ట్రైలర్.. సమ్ థింగ్ స్పెషల్ అనేలా..



తెలుగమ్మాయి సుమయ రెడ్డి తన ఆల్ రౌండర్ టాలెంట్ తో ఇండస్ట్రీలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. రైటర్‌గా కథను రాసి, నిర్మాతగా డబ్బు పెట్టి, హీరోయిన్‌గా నటిస్తూ 'డియర్ ఉమ' అనే చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమా ఏప్రిల్ 18న విడుదలకాబోతుండగా, ప్రమోషన్స్ జోరుగా సాగుతున్నాయి. శుక్రవారం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో చిత్రబృందం మాట్లాడిన మాటలు సినిమాపై మంచి అంచనాలు పెంచాయి. ఇందులో హీరోగా పృథ్వీ అంబర్ నటించగా, దర్శకత్వం సాయి రాజేష్ మహాదేవ్ వహించారు. ట్రైలర్ చూస్తే సమ్ థింగ్ స్పెషల్ అనేలా ఉంది. హీరో ఒక సింగర్ కావాలని, హీరోయిన్ ఒక డాక్టర్ కావాలని కలలు కంటారు. అయితే ఇద్దరికి ఎదురైన సంఘటనల నేపథ్యంలో కథ నడవనుందని అర్థమవుతోంది. కార్పొరేట్ ఆసుపత్రుల వ్యాపార ధోరణిపై ఓ బలమైన సందేశాన్ని సినిమాలో చూపించబోతున్నట్టు ట్రైలర్ నుంచే స్పష్టమవుతోంది. రథన్ సంగీతం, రాజ్ తోట సినిమాటోగ్రఫీ కూడా సినిమాకు హైలైట్ కానున్నాయి. ఈ సందర్భంగా సుమయ రెడ్డి మాట్లాడుతూ.. "ఓ మంచి కంటెంట్ ఇవ్వాలనే ఉద్దేశంతోనే ఈ సినిమా చేశాను. కథ రాస్తున్నప్పుడు ఎంతో విశ్వాసంతో ముందుకు వెళ్లాను. నిర్మాత దొరకకపోయినా, మా అమ్మ నా వెనుక నిలిచింది. ఇది మా ఫ్యామిలీ టీం వర్క్. అందరూ కలసి చేశాం. ఏప్రిల్ 18న మా సినిమాను అందరూ చూసి సక్సెస్ చేయండి" అని పేర్కొన్నారు. హీరో పృథ్వీ అంబర్ మాట్లాడుతూ.. "తెలుగులో ఇది నా ఫస్ట్ మూవీ. సుమయ మామూలు హీరోయిన్ కాదు. రైటర్, ప్రొడ్యూసర్‌గా కూడా ఎంత కష్టపడారో చూశాను. నాకు 'దియా' సినిమా తర్వాత మంచి ఫాలోయింగ్ వచ్చింది. ఈ సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకుల మళ్లీ కలవాలన్న ఆశ ఉంది" అన్నారు. %ూశ్రీంశీ =ఝుస% – అక్కినేని ఫ్యాన్స్‌కి మరో వంద కోట్ల మూవీ...! మ్యూజిక్ డైరెక్టర్ రథన్ మాట్లాడుతూ.. "సుమయలో ఉన్న ప్యాషన్ నన్ను ఆకట్టుకుంది. మంచి కంటెంట్‌తో చేసిన సినిమా ఇది. పాటలు, ఆర్‌ఆర్ అన్నీ బాగా వచ్చాయి. మిగతా టీం కూడా ఎంతో శ్రమించి ఈ సినిమా చేశారని చెప్పగలను. ఏప్రిల్ 18న థియేటర్‌కు రండి.. 'డియర్ ఉమ'ను చూసి మాకు విజయాన్ని అందించండి" అని కోరారు. మరి ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.

PRINTED,PUBLISHED AND OWENED BY BEZAWADA NAGA BHARGAVI AND PRINTED AT: V PRINT GRAPHICS S-14,ADDEPALLI COMPLEX,GUDIWADA-521-301 , KRISHNA DISTRICT ,ANDHRA PRADESH AND PUBLISHED FROM H.NO 12 /323,TAILORING VEEDHIGUDIVADA -521 301,KRISHNA DISTRICT, ANDHRA PRADESH
EDITOR : BEZAWADA EDUKONDALU,RNI TITLE CODENO: APBIL16314, PHONE NO: 9849044212, EMAIL ID :